VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 295
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
శుక్రవారం 10 ఏప్రిల్ 2026

# 2027 మార్చికి 1.12 కోట్ల పాస్ పుస్తకాల పంపిణీ

● ఇక భూ రికార్డులు ఎవరూ తారుమారు చేయలేరు ● 1.37 లక్షల ఎకరాల ఇనాం భూముల్ని 22ఏ నుంచి తొలగింపు ● ఆటో మ్యుటేషన్ తర్వాత నేరుగా ఇంటికే పాస్ పుస్తకం ● రాజధాని నిర్మాణానికి రూ.2 లక్షల కోట్లని తప్పుడు ప్రచారం ● కన్నతల్లిని కోర్టుకీడ్చిన వ్యక్తికి మహిళల గురించి మాట్లాడే అర్హతుందా..? ● అధికారంలో ఉంటే విధ్వంసం...లేకపోతే బెదిరింపులు ● మినీ గోవాగా సూర్యలంక బీచ్ అభివృద్ధి ● సూరేపల్లి 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు







**వేమూరు,కలంకౌంటర్ :** రాష్ట్రంలో భూ సమస్యలను లేకుండా చేసేందుకు ప్రభుత్వం పని చేస్తోందని, 2027 మార్చి నాటికి 1.12 కోట్ల పట్టదారు పాసుపుస్తకాలను పంపిణీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఒక్క రూపాయి కూడా అవినీతికి తావు లేకుండా పాసుపుస్తకాలు అందింస్తున్నామని తెలిపారు. ఆటో మ్యుటేషన్ తర్వాత నేరుగా ఇంటికి పాస్ పుస్తకాలను పంపాలని అధికారులను ఆదేశించారు. బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గం సూరేపల్లి గ్రామంలో 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి సందర్శించారు. వేదికపై రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. వారి సమక్షంలోనే పొలం వివరాలను అధికారులతో చదివి వినిపించారు అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."గత పభుత్వంలో ప్రజల భూమిపై కన్నేసి కబ్జాలు చేశారు. ప్రశ్నించిన వారిని కట్టడి చేసేందుకు బ్లాక్ మెయిల్ చేశారు. రికార్డులు తారుమారు చేశారు. ప్రతీ గ్రామంలో, ప్రతి ఇంటిలో భూ వివాదాలకు తెరలేపి భయానక వాతావరణం సృష్టించారు. పట్టాదారు పాస్ పుస్తకాలపైనా జగన్ తన ఫోటో వేసుకున్నాడు. సరిహద్దు రాళ్లపైనా బొమ్మలు చెక్కించుకున్నాడు. ఇందుకోసం వందల కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేశారు. వారు అధికారం నుంచి దిగిపోయినా పాపాలు, అక్రమాలు ఇంకా వెంటాడుతున్నాయి. అంతలా రెవెన్యూ వ్యవస్థను నాశనం చేశారు. ప్రజల ఆస్తులకు భద్రత, ప్రజల జీవితాలకు భరోసా ఇవ్వాలనే లక్ష్యంతో ప్రతీ నెల నేను స్వయంగా పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నాను. భూమి అనేది ఆస్తి మాత్రమే కాదు. భద్రత, జీవనాధారం. అర్జీల్లో రెవెన్యూ సమస్యలవే ఎక్కువగా ఉంటున్నాయి. అందుకే భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించాలని సంకల్పించాం. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం కోసం రీ సర్వే 2.0 చేపట్టాం. రాష్ట్రంలో మొత్తం 16,816 గ్రామాల్లో రీ సర్వే చేయాల్సి ఉండగా, ఇప్పటికే 6,976 గ్రామాల్లో పూర్తి చేశాం. 2027 మార్చి నాటికి రీ సర్వే పూర్తి చేసి ప్రతి ఒక్కరికి రాజముద్రతో కొత్త పాసుపుస్తకాలు ఇస్తాం. ఈ జనవరి నుంచి మార్చి వరకు 21.23 లక్షల కొత్త పాసుపుస్తకాలు ఇచ్చాం. ఈ నెలలో 356 గ్రామాల్లో 1,56,433 పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. జూలై నాటికి మరో 9 లక్షల పట్టాదారు పుస్తకాలు ఇస్తాం. 11,099 గ్రామాల్లో కొత్తగా ఇవ్వాల్సిన 80 లక్షలు పాస్ పుస్తకాలను వచ్చే ఏడాది మార్చి నాటికి పంపిణీ చేస్తాం. 1.10 కోటి మందికి పాస్ పుస్తకాలు ప్రజలకు అందిస్తాం. కరెన్సీకి వాడే టెక్నాలజీనే పాస్ పుస్తకాలకూ వాడుతున్నాం. భవిష్యత్‌లో ఎవరూ రికార్డులు తారుమారు చేయలేరు. రాజీలేకుండా మూడుసార్లు పట్టాదారుకు చెప్పి ఈ కేవైసీ చేస్తున్నాం. రికార్డులు ట్యాంపరింగ్ చేయకుండా వాటిని భద్రపరిచేందుకు బ్లాక్ చైన్ టెక్నాలజీ తీసుకొచ్చాం. క్యూఆర్ కోడ్ పెట్టాం. రికార్డుల లాకర్ సిస్టమ్ తెచ్చాం. దీని ద్వారా భూ యజమానులు ఆధార్, ఈ కేవైసీ ఇచ్చి తమ భూముల రికార్డులు లాక్ చేసుకోవచ్చు. రికార్డ్ లాకింగ్ అనేది రక్షణ కవచంగా ఉంటుంది. ప్రజల ఆస్తులకు, భూములకు రక్షణ కల్పించేందుకు ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేశాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**లక్షలాది ఎకరాలకు విముక్తి..** "1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22ఏ నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నాం. అలాగే ఇతర సర్వీస్ ఇనాంలోని మరో లక్ష ఎకరాల భూములకూ విముక్తి కల్పించేందుకు 2019లోనే ఆర్డినెన్స్ తెచ్చాం. 2016కు ముందు ఏదైనా ప్రభుత్వ హౌసింగ్

- 2లో

# పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచడం అనివార్యం!

● పిల్లల్లో సృజనాత్మకత దెబ్బతినకుండా చట్టం రూపొందించండి ● దీనిపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం ● సోషల్ మీడియాలో విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు ● మంత్రుల బృందం సమావేశంలో నారా లోకేష్ స్పష్టీకరణ




**అమరావతి,కలంకౌంటర్ :** సోషల్ మీడియాకు 13 సంవత్సరాల లోపు బాలలను దూరంగా ఉంచడంపై విధివిధానాలు తయారుచేసి, మసాయిదా చట్టాన్ని సిద్ధం చేయాల్సిందిగా రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. చిన్నపిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచేందుకు విధివిధానాల తయారీ, చట్టరూపకల్పనపై ఉండవల్లి నివాసంలో మంత్రుల బృందం... సోషల్ మీడియా ప్లాట్ ఫాంల ప్రతినిధులు, అధికారులతో సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... సోషల్ మీడియా దుష్ప్రభావానికి లోనుకాకుండా 13 నుంచి 16సంవత్సరాల పిల్లలకు వయసు ఆధారిత కంటెంట్ ను అందుబాటులో ఉంచేవిధంగా విధివిధానాలను రూపొందించాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో మహిళలపట్ల అవమానకరమైన, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. పిల్లల డిజిటల్ భద్రత, శ్రేయస్సు, లీగల్ మెకానిజం ఫ్రేమ్ వర్క్ పై ఇతర రాష్ట్రాలు, దేశాల్లో అనుసరిస్తున్న అత్యుత్తమ విధానాలను అధికారులు అధ్యయనం చేయాలన్నారు. పిల్లలను సెన్సిటివ్ కంటెంట్ కు దూరంగా ఉంచడంపై ఆస్ట్రేలియా, సింగపూర్, డెన్మార్క్ వంటి దేశాల్లో అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని సూచించారు. పిల్లలపై సోషల్ మీడియా ప్రభావంపై పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. నో బ్యాగ్ డే రోజున ఉపాధ్యాయులు విద్యార్థులకు, ప్రతిఏటా రెండుసార్లు నిర్వహించే మెగా పిటిఎంలో కూడా తల్లిదండ్రులు, విద్యార్థులకు సోషల్

- 2లో





హోం మంత్రి వంగలపూడిఅనిత వివిధ కార్యక్రమాలలో ఎం ఎల్ ఎ చింతమనేని ప్రభాకర్ తో కలిసి పాల్గొన్నారు.

-దెందులూరు,కలంకౌంటర్ :

# అభివృద్ధి, ఆధ్యాత్మికతతో అంతర్వేది వర్ధిల్లాలి

● పవిత్ర క్షేత్రంలో తాగునీటి సమస్య ఉండకూడదు ● రాజోలు నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ● రూ.17.33 కోట్లతో అంతర్వేదిలో నిర్మించిన మంచినీటి పథకం ప్రారంభం ● తీరనున్న 30 వేల మంది తీర ప్రాంత ప్రజల తాగునీటి కష్టాలు ● రూ. 5 కోట్లతో ర్యాపిడ్ సాండ్ ఫిల్టర్ 6 ఎంఎల్ టీ నిర్మాణానికి శంకుస్థాపన




**అమరావతి,కలంకౌంటర్ :** 'ఏదైనా ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే అక్కడ చేపట్టాల్సింది కేవలం నిర్మాణాలు మాత్రమే కాదు, అక్కడ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలి. మౌలిక వసతులు మెరుగుపరచి వారి జీవితాలకు భరోసా ఇవ్వాలి. భవిష్యత్తుపై నమ్మకం కలిగించాల'ని ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు స్పష్టం చేశారు. అంతర్వేదిలాంటి పవిత్ర ప్రాంతంలో అభివృద్ధి, ఆధ్యాత్మికతతో కలిసి నడవాలని ఆకాంక్షించారు. ఈ పుణ్యభూమి అభివృద్ధికి కూటమి ప్రభుత్వం బలమైన సంకల్పంతో పని చేస్తుందని హామీ ఇచ్చారు. గురువారం రాజోలు నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ముందుగా రూ.17.33 కోట్లతో అంతర్వేదిలో నిర్మించిన మంచినీటి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఓ.ఎన్.జి.సి. నిధులు రూ. 5 కోట్లతో 6 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన ర్యాపిడ్ సాండ్ ఫిల్టర్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కింజరాపు అచ్చెన్నాయుడు గారు , స్థానిక శాసనసభ్యులు శ్రీ దేవ వరప్రసాద్ గారు, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల గారు, గ్రామీణ నీటిసరఫరా విభాగం ఈఎన్సీ శ్రీమతి గాయత్రి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి ఆశీస్సులతో ఈ రోజున మీ అందరి కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం ఆనందంగా ఉంది. జల్ జీవన్ మిషన్ నిధులతో అంతర్వేది దేవస్థానం, అంతర్వేదికర, పల్లెపాలెం, గొంది గ్రామ పంచాయతీల పరిధిలో 13 గ్రామాలకు చెందిన 30 వేల మంది ప్రజల దాహార్తి తీర్చే లక్ష్యంతో రూ.17.33 కోట్లతో నిర్మించిన సమగ్ర రక్షిత తాగునీటి సరఫరా పథకాన్ని మీ అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చాం. ఈ ప్రాజెక్టు 30 వేల మంది తీర ప్రాంత ప్రజల దాహార్తిని తీరుస్తుంది. దీని కోసం 10 ఎకరాల

- 2లో

# చట్టసభల్లో యువతకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలి: ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు




**గోవా,కలంకౌంటర్ :** దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం పెరగాలంటే, చట్టసభల్లో 40 ఏళ్ల లోపు వారికి కనీసం 33 శాతం సీట్లను రొటేషన్ పద్ధతిలో రిజర్వ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రతిపాదించారు. గోవాలో జరుగుతున్న కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) పశ్చిమ ప్రాంత సదస్సులో 'దేశాభివృద్ధిలో యువ శాసనకర్తల పాత్ర' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. సగటు భారతీయుడి వయసు 32 ఏళ్లు కాగా, లోక్‌సభ సభ్యుల సగటు వయసు 56, ఏపీ శాసనసభ్యుల సగటు వయసు 53 ఏళ్లుగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సగటు పౌరుడికి, ప్రజాప్రతినిధులకు మధ్య వయసులో 20 ఏళ్ల వ్యత్యాసం ఉండటంపై అందరూ ఆలోచించాలన్నారు. 18వ లోక్‌సభలో 40 ఏళ్ల లోపు యువత కేవలం 11 శాతం మాత్రమే ఉండగా, ఏపీ అసెంబ్లీలో ఇది 7 శాతానికే పరిమితమైందని వివరించారు. చట్టసభల్లో కొందరు శాసనసభ్యుల ప్రవర్తన కారణంగా యువత రాజకీయాలను ఏవగించుకుంటున్నారని, ప్రజాప్రతినిధుల పనితీరు ఆదర్శప్రాయంగా ఉంటేనే రాజకీయాల పట్ల యువతకు గౌరవం కలుగుతుందని స్పీకర్ పేర్కొన్నారు. విద్యార్థి దశలో రాజకీయాలకు దాదాపు తెరపడటం, విశ్వవిద్యాలయాల నుంచి నాయకులు రాకపోవడం దీనికి ఒక కారణమన్నారు. 1982లో ఎన్టీ రామారావు యువతకు అవకాశాలు కల్పించడం వల్లే ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని తాను 25 ఏళ్లకే ఎమ్మెల్యేను కాగలిగానని, అవకాశం కల్పిస్తే యువత తప్పక రాణిస్తుందని ఆయన గుర్తు చేసుకున్నారు. త్వరలో రాబోతున్న మహిళా రిజర్వేషన్ల తరహాలోనే, చట్టసభల్లో యువతకు సైతం రిజర్వేషన్లు కల్పించాలని అయ్యన్నపాత్రుడు సూచించారు. ఈ ఆలోచన విమర్శలకు దారితీసినప్పటికీ, విభిన్నంగా ఆలోచించి యువతను చట్టసభల్లోకి తీసుకువస్తేనే కొత్త ఆలోచనలతో మెరుగైన భవిష్యత్తుకు పునాదులు పడతాయని ఆయన స్పష్టం చేశారు.

# సుపరిపాలనకు నాందీ తండ్రీకొడుకుల పాదయాత్ర

● వైఎస్సార్ ప్రజాప్రస్థానం దేశంలోనే గుర్తింపు పొందిన పాదయాత్ర ● తండ్రికి మించిన తనయుడిగా వైఎస్ జగన్ సుదీర్ఘంగా ప్రజా సంకల్ప యాత్ర




**తాడేపల్లి,కలంకౌంటర్ :** తాడేపల్లి లోని వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర 23 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా కేక్ కట్ చేసి పార్టీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పి.రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మల్లాది విష్ణు, నాయకులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, దొంతిరెడ్డి వేమారెడ్డి, కాకమాను రాజశేఖర్, చెల్లా మధుసూదన్‌రెడ్డి, వర్షవర్ధన్‌రెడ్డి, నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి , వైయస్ఆర్‌సీపీ అధినేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలు సుపరిపాలనకు నాందీ పలికాయని మాజీ మంత్రి, గుంటూరు జిల్లా వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు అంబటి రాంబాబు స్పష్టం చేశారు. తండ్రీకొడుకులు పాదయాత్ర చేసిన ఘటనలు దేశంలో ఎక్కడా కనిపించవని, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఇది సాధ్యమైందన్నారు. వారి పాదయాత్రల్లో తాను కూడా భాగస్వామి అయినందుకు గర్వంగా ఉందని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన చారిత్రాత్మక పాదయాత్ర 'ప్రజాప్రస్థానం' 23 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మహానేతకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్ రెడ్డి, మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు. అలాగే నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కాకమాను రాజశేఖర్, చెల్లా మధుసూదన్‌రెడ్డి, వర్షవర్ధన్‌రెడ్డి, నారాయణమూర్తి సహా పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు ఏమన్నారంటే

**దేశాన్ని కదిలించిన ప్రజాప్రస్థానం: అంబటి రాంబాబు, మాజీ మంత్రి..** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనే డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి చేవెళ్ల నుంచి ప్రజాప్రస్థానం పాదయాత్ర ప్రారంభించారు. ఎండలు మండే ఏప్రిల్ నెలలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవాలనే సంకల్పంతో ఆయన ఈ యాత్ర చేపట్టారు. ఇచ్ఛాపురం వరకు సాగిన ఈ పాదయాత్రలో వైఎస్సార్ సాధారణ ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆ రోజుల్లో కార్వాన్‌లు, సౌకర్యాలు లేకపోయినా రోడ్డు పక్కనే విశ్రాంతి తీసుకుంటూ యాత్ర కొనసాగించారు. ఈ పాదయాత్ర దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించి, తర్వాత సంక్షేమ పాలనకు బాటలు వేసింది. వైఎస్సార్ పాదయాత్ర ఫలితంగానే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చింది, కేంద్రంలో కూడా ప్రభావం చూపింది. పాదయాత్రలో మొదటి రోజు నుంచి చివరి వరకు తాను, లగడపాటి రాజగోపాల్, భూమన కరుణాకర్ రెడ్డి పాల్గొనడం గర్వకారణం. వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు మరింత సుదీర్ఘమైన పాదయాత్ర చేసి తండ్రికి మించిన నాయకుడిగా నిలిచారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పాలనలో ప్రతిబింబింపజేశారు.

**రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు: గడికోట శ్రీకాంత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి..** వైయస్సార్‌ను తలచుకునేందుకు గర్వపడుతున్నాను. వైఎస్సార్ పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపు తిప్పింది. ఈ రాష్ట్రం ఎలా ఉందో నెక్స్ట్ జనరేషన్‌కు చెప్పాలంటే ..2004కు ముందు, తరువాత రాష్ట్ర పరిస్థితులు ఎలా మారాయో చర్చించాల్సిన అవసరం ఉంది. మండు వేసవిలో ప్రజల సమస్యలను తెలుసుకుని, అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పాలన అందించడం వైఎస్సార్ నాయకత్వానికి నిదర్శనం. వైఎస్సార్ ప్రజాప్రస్థానం పాదయాత్ర కేవలం రాజకీయ యాత్ర కాకుండా, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఉద్యమంగా నిలిచింది. అదే స్ఫూర్తితో వైఎస్ జగన్ కూడా పాలనలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

**- తండ్రీకొడుకుల పాదయాత్ర చరిత్రాత్మకం: అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ..** దేశ చరిత్రలో తండ్రీకొడుకులు ఇద్దరూ పాదయాత్రలు చేసి ప్రజల్లో మమేకమవడం అరుదైన విషయం. వైఎస్సార్ సుమారు 1475 కిలోమీటర్లు పాదయాత్ర చేసి ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలకు రూపకల్పన చేశారు. అలాగే వైఎస్ జగన్ 3,600 కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేసి ప్రజల నమ్మకాన్ని గెలుచుకుని అధికారంలోకి వచ్చారు. తండ్రి ఒక్క అడుగు వేస్తే తనయుడిగా నాలుగు అడుగులు ముందుకు వేస్తూ సంక్షేమ పాలన అందించారు.

**సువర్ణ అక్షరాలతో నిలిచిన చారిత్రక ఘట్టం: మల్లాది విష్ణు, మాజీ ఎమ్మెల్యే..** ఆంధ్రప్రదేశ్ చరిత్రలో వైయస్ఆర్ పాదయాత్ర ప్రారంభమైన రోజును సువర్ణ అక్షరాలతో లిఖించాల్సిన అవసరం ఉంది. ఆనాటి పరిస్థితుల్లో రైతుల సమస్యలు పరిష్కారం కాకపోవడం, మహిళలు, విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వైయస్ఆర్ మండుటెండల్లో మహాప్రస్థానం పాదయాత్రను ప్రారంభించారు. ఆ పాదయాత్ర ప్రభావం రాష్ట్ర రాజకీయాల్లో చారిత్రక మలుపు తీసుకువచ్చింది. రైతులకు ఉచిత విద్యుత్ అందించే ఫైల్‌పై తొలి సంతకం పెట్టిన నాయకుడు వైయస్ఆర్‌రు. అలాగే ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసి పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చారు. వైయస్ఆర్ అడుగుజాడల్లోనే ప్రస్తుత నాయకుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్నారు, వైయస్ఆర్‌సీపీ స్థాపించి తండ్రిని మించిన తనయుడిగా గత ఐదేళ్ల పాలన సాగించారు. వైయస్ఆర్ ఆలోచనలతోనే వైయస్ఆర్‌సీపీ నూటికి నూరుపాళ్లు ముందుకు సాగుతోందని అని మల్లాది విష్ణు అన్నారు.

**పేదల గుండెల్లో చిరస్థాయిగా వైయస్ఆర్‌కు స్థానం: రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ..** వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు ఈ రోజుకీ కొనసాగుతున్నాయి. పేదల ఆరోగ్యానికి, విద్యకు ఇవి అండగా నిలిచాయి. జలయజ్ఞం ద్వారా సాగునీరు అందించి వేల ఎకరాలను సస్యశ్యామలం చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుంది. వైఎస్ జగన్ కూడా రాయలసీమ అభివృద్ధికి ఎత్తిపోతల పథకాలను ప్రారంభించారు.

# పొగాకు వేలం ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

● రైతులపట్ల సానుకూలంగా వ్యవహరించి, గిట్టుబాటు ధర ఇవ్వాలని వ్యాపారులకు సూచించిన ఎమ్మెల్యే



**కందుకూరు, కలంకౌంటర్ :** పట్టణంలోని పామూరు రోడ్డులో గల 27వ నెంబర్ పొగాకు వేలంకేంద్రంలో... పొగాకు అమ్మకాలను కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు , బోర్డు రీజినల్ మేనేజర్ దివి వేణుగోపాల్, ఇతర అధికారులతో కలిసి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. తొలిరోజు వలేటివారిపాలెం మండలం అమ్మపాలెం గ్రామం నుంచి 18 బేళ్ళు వేలానికి రాగా, ప్రారంభ ధర కిలో 250 రూపాయలు పలికింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరు ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు పొగాకు పంటపై ఆధారపడి ఉన్నారని, ఏడాదికేడాది ఖర్చులు కూడా విపరీతంగా పెరుగుతున్నాయని, రైతుల బాధలను అర్థం చేసుకొని ధరలు నిర్ణయించాలని ఎమ్మెల్యే కోరారు. గత ఏడాది గిట్టుబాటు ధరలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, ఈ ఏడాది మార్కెట్ పై రైతులు ఆందోళనగా ఉన్నారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెప్పారు. ఈ సంవత్సరం పంట నాణ్యత కూడా బాగుందని, గడిచిన ఏడాదికంటే రేట్లు పెంచాలన్నారు. రైతులు కూడా, మార్కెట్ ను అంచనా వేస్తూ... బోర్డు అధికారులు సూచించిన రకం బేళ్ళను తేవాలని, అధికారుల సూచనలు తప్పక పాటించాలని కోరారు.కార్యక్రమంలో వేలంకేంద్రం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రైతు నాయకులు తానికొండ రమణయ్య, వడ్లమూడి రామకృష్ణ, నెల్లూరు పార్లమెంట్ టిడిపి ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, పార్టీ నాయకులు కంద్రా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

# అన్నా క్యాంటీన్లను సక్రమంగా నిర్వహించాలి - కమిషనర్ ఎన్.మౌర్య



**తిరుపతి,కలంకౌంటర్ :** అన్నా క్యాంటీన్లను సక్రమంగా నిర్వహించాలని, ఎటువంటి లోపాలు ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం నగరంలోని స్విమ్స్ కూడలి వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాయంత్రం భోజనం చేస్తున్న వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చేవారికి నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నారు. అన్నం వృధా చేయకుండా తగినంత తీసుకోవాలని తెలిపారు. ఒక్కొక్కరు ఒక్క టోకెన్ మాత్రమే తీసుకోవాలని సూచించారు. క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. ప్రజల నుండి ఎటువంటి పిర్యాదులు అందకుండా జాగ్రత్తగా శుభ్రమైన ఆహార పదార్థాలు అందించాలని తెలిపారు.

# చంద్రబాబు విజన్, లోకేశ్ కృషి ఫలితం... 'సిటీ ఆఫ్ డెస్టినీ' నుంచి గ్లోబల్ ఏఐ సిటీగా విశాఖ

**విజయవాడ, కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానంలో మరో చారిత్రాత్మక అధ్యాయం మొదలుకాబోతోంది. ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్, విశాఖపట్నంలో భారీ డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్ ఏర్పాటుకు సిద్ధమైంది. సుమారు 15 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1.35 లక్షల కోట్లు) పెట్టుబడితో రానున్న ఈ మెగా ప్రాజెక్టుకు ఈ నెల 28న ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేయనున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ ప్రాజెక్టుతో ఇప్పటివరకు 'సిటీ ఆఫ్ డెస్టినీ'గా ఉన్న విశాఖ, ఇకపై 'గ్లోబల్ ఏఐ సిటీ'గా ప్రపంచ పటంలో నిలవనుందని ఆయన అన్నారు.

# విజయవాడ నగరంలో పెండింగ్ అభివృద్ధి ప్రాజెక్టులపై దృష్టి సారించాలి

● నగర పాలక సంస్థ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ● త్వరలోనే నగరాభివృద్ధిపై సీఎంతో సమావేశం ఉంటుందని అధికారులకు తెలిపిన ఎంపీ శివనాథ్ ● సీఎం దృష్టికి నగర సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపడతామని వెల్లడి








**విజయవాడ, కలంకౌంటర్ :** విజయవాడ నగరంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసేలా అధికారులు దృష్టి సారించాలని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. నగరపాలక సంస్థ అభివృద్ధి పై అధికారులతో నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని) సమీక్ష సమావేశంను గురువారం నిర్వహించారు. కార్పొరేషన్ ప్రత్యేక అధికారిగా ఉన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా నేతృతంలో జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, అన్ని విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు హాజరై నగర అభివృద్ధి పనులను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. నగరంలో ఆగిపోయిన స్ట్రాం వాటర్ డ్రైనేజీ పనులు, రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యం పై సమీక్ష నిర్వహించారు. స్ట్రాం వాటర్ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా ఇప్పటికే రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ దృష్టి కి తీసుకెళ్లడం జరిగిందని ఎంపీ శివనాథ్ తెలిపారు. అదే క్రమంలో ప్రజలకు ఇబ్బంది , భారాలు లేకుండా నగరపాలక సంస్థ ఆదాయం మెరుగుదలపై ఎంపీ, అధికారులు సమీక్ష నిర్వహించారు. నగరంలో నగర పాలక సంస్థకు ప్రస్తుతం ఉన్న ఆదాయ వనరులు, కాంప్లెక్స్‌ల ద్వారా వచ్చే ఆదాయం, ఇంకా ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్న వాటిపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. నగరపాలక సంస్థ సమన్వయంతో నగరంలో రైల్వే పెండింగ్ ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో ఎంపీ కేశినేని శివనాథ్ చర్చించారు. వాంబే కాలనీ , మధురానగర్ వద్ద రైల్వే వంతెనల నిర్మాణ పరమైన విషయాలు తెలుసుకుని అధికారులకు పలు సూచనలను ఎంపీ చేశారు. నగరంలోని కాల్వల బ్యూటిఫికేషన్‌పై ఎంపీ చిన్ని అధికారులతో చర్చించి ఏ విధంగా కాల్వల బ్యూటిఫికేషన్ చేయాలనే దానిపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అతి త్వరలో విజయవాడ నగరపాలక సంస్థ అభివృద్ధిపై సీఎం చంద్రబాబుతో సమావేశం ఉంటుందని అధికారులకు తెలిపిన ఎంపీ చిన్ని ఆ సమావేశం నాటికి నగర సమగ్ర అభివృద్ధిపై ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. నగర అభివృద్ధిపై ఇప్పటికే సిద్ధం చేసిన డీపీఆర్ లోని పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మీడియాతో ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని) మాట్లాడుతూ....ఇటీవలే నగర పాలక సంస్థ గవర్నింగ్ కౌన్సిల్ పదవీ కాలం ముగియడంతో ప్రస్తుతం అభివృద్ధి పనులన్నీ అధికారుల పర్యవేక్షణలోనే జరుగుతున్నాయన్నారు. ఆ క్రమంలో నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కలెక్టర్ లక్ష్మీశా, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రలతో కలసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. విజయవాడ నగరానికి కావాల్సిన అవసరాలు మరియు చేపట్టాల్సిన పనుల గురించి ఈ సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు. నగర అభివృద్ధి క్రమంలో అడ్డంకులుగా ఉన్న సమస్యలన్నింటినీ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీ కేశినేని చిన్ని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి. సత్యకుమారి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, ఎస్టేట్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, సూపర్ ఇంటెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, డిఎఫ్ఓ మాల్యాద్రి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జె. శ్రీనివాస్, ఏ. శ్రీనివాస్ రెడ్డి, సామ్రాజ్యం, గోపాలకృష్ణ, ప్రభాకర్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ గోపాల నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

# జగన్ అడుగుపెట్టిన చోట విధ్వంసమే

**- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఫైర్**

● తండ్రి మృతిపైనా రాజకీయాలు చేసిన వ్యక్తి జగన్ ● వివేకా హత్య వెనుక ఉన్న ప్రశ్నలకు జగన్ సమాధానం చెప్పాలి ● తల్లి, చెల్లిని గౌరవించని వ్యక్తి రాష్ట్రాన్ని ఎలా గౌరవిస్తాడు?
● రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిన పాలన జగన్‌ది ● జగన్ పాలనలో రాష్ట్రం అరాచకానికి అడ్డాగా మారింది ● ఒక్క ఛాన్స్ ఇచ్చిన ప్రజలు.. జీవితాంతం పశ్చాత్తాపపడ్డారు ● రాష్ట్రం బాగుపడితే జగన్‌కు నచ్చదు
● జగన్ పాలన అంటే విధ్వంసం, దోపిడి, అరాచకం ● జగన్‌ను ఆయన పార్టీ వాళ్లే జోకర్‌లా చూస్తున్నారు




**అమరావతి,కలంకౌంటర్ :** అమరావతి, ఏప్రిల్ 9: గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే వైఎస్ జగన్ రెడ్డి తీసుకున్న ప్రతి నిర్ణయం ప్రజల జీవితాలను, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థని దెబ్బతీసిందని, ఆయన చేష్టల వలన పరిశ్రమలు పారిపోయాయని, యువతకు ఉద్యోగాలు లేక, రైతు కష్టానికి విలువ లేకుండా పోయిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దుయ్యబట్టారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో మీడియా సమావేశంలో వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డిపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేస్తూ, సంక్షేమం పేరుతో అప్పుల బారం పెంచి రాష్ట్రాన్ని ఆర్థికంగా జగన్ బలహీనపరిచారని మండిపడ్డారు. అభివృద్ధి అన్న మాట కేవలం మాటల్లోనే మిగిలిపోయిందని, నేలమీద మాత్రం విధ్వంసం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. పదవి కోసం కుటుంబాన్ని, సమాజాన్ని, రాష్ట్రాన్ని కూడా తాకట్టు పెట్టే వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. ఒక వ్యక్తి ప్రవర్తన వల్ల కుటుంబాలు ఎలా చీలిపోతాయో, సమాజంలో విభేదాలు ఎలా వస్తాయో, ప్రాంతాల మధ్య, కులాల మధ్య ఎలా చిచ్చు పెట్టొచ్చో జగన్‌ను చూస్తే అర్థమవుతుందని అచ్చెన్నాయుడు అన్నారు. 2014-19 మధ్య సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం స్వర్ణయుగాన్ని చూసిందని, కానీ 2019లో ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించి, ఆర్థిక వ్యవస్థను కుదేలు చేశారని ఆరోపించారు. 2024లో ప్రజలు జగన్‌కు గట్టిగా బుద్ధి చెప్పారని, సీఎం చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి ఘన విజయం ఇచ్చారని పేర్కొన్నారు. కేవలం 22 నెలల్లోనే రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టి, అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళుతున్నామని చెప్పారు. రాయలసీమకు నీరు అందిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేస్తూ, అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పనిచేస్తుంటే జగన్‌కు రాష్ట్రం మీద ఎందుకింత కక్ష? అని ప్రశ్నించారు. జగన్‌కు పదవి తప్ప మరో ఆలోచనే లేదని, ముఖ్యమంత్రి కుర్చీ కోసం ఆయన ఎవరినైనా, ఏదైనా త్యాగం చేస్తారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కనిపించకపోయినప్పుడు రాష్ట్రం మొత్తం ఆందోళన చెందింది. ఆనాడు చంద్రబాబు నాయుడు కూడా ప్రత్యేకంగా ఆచూకీ కోసం ప్రయత్నించారు. కానీ అదే సమయంలో జగన్ సీఎం పదవి కోసం సంతకాల సేకరణలో పడ్డారని అందరికీ తెలుసు అని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణంపై కూడా అనేక అనుమానాలు ఉన్నాయని, ఆ రోజు జగన్ ఎక్కడ ఉన్నారు, ఇతర రాష్ట్రాల్లో ఎందుకు ఉన్నారు అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైఎస్ మరణం వెనుక జగన్ పాత్ర ఉందని అప్పట్లోనే పలువురు సీనియర్ నాయకులు మాట్లాడారు. బొత్స సత్యనారాయణ కూడా బహిరంగంగా వ్యాఖ్యానించారు. ఆ రోజున మేము అంత సీరియస్‌గా తీసుకోలేదు. కానీ జగన్ తరువాత ప్రవర్తన చూస్తే ఇప్పుడు అనుమానాలు మరింత పెరుగుతున్నాయి అని అచ్చెన్నాయుడు అన్నారు. వివేకానంద రెడ్డి హత్యను ప్రస్తావిస్తూ, బాబాయిని కిరాతకంగా చంపి, ఆ ఘటనను రాజకీయ లాభాల కోసం ఉపయోగించుకున్న వ్యక్తి జగన్ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తల్లి, చెల్లిని కూడా బయటకు పంపించిన వ్యక్తి జగన్. కుటుంబ సభ్యులను కూడా గౌరవించని వ్యక్తి రాష్ట్ర ప్రజలను ఎలా గౌరవిస్తాడు? అని ప్రశ్నించారు. అమరావతి రాజధానిపై కూడా జగన్ ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. అమరావతిని అంగీకరించిన జగన్, అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టారు. ప్రజల ఆశలు, రైతుల త్యాగాలను తాకట్టు పెట్టారు అని విమర్శించారు. అమరావతి రాష్ట్రానికి ఏకైక రాజధాని. దేశవ్యాప్తంగా అన్ని పార్టీలు, అన్ని ప్రాంతాల ప్రజలు అమరావతికి మద్దతు తెలిపారు. కానీ జగన్ మాత్రం ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టి రాష్ట్రాన్ని వెనక్కి నెట్టారు అని అన్నారు. జగన్‌ను ప్రజలు ఇక నమ్మరని, ఆయనను ఆయన పార్టీ వాళ్లే జోకర్‌లా చూస్తున్నారని అచ్చెన్నాయుడు అన్నారు. నిమిషానికి ఒక మాట, పూటకు ఒక మాట మాట్లాడే వ్యక్తి జగన్. ఆయన మాటకు ఆయనకే విలువ లేదు. పదవి కోసం ఆయన కుటుంబాన్ని, పార్టీని, రాష్ట్రాన్ని కూడా తాకట్టు పెట్టారు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రాన్ని మళ్లీ బాగు చేయాలంటే ఇటువంటి వ్యక్తులకు రాజకీయాల్లో స్థానం ఉండకూడదు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు చాలా తెలివైన వారు. ఒక్కసారి అవకాశం ఇచ్చారు. ఇక జీవితంలో జగన్‌కు అధికారంలోకి వచ్చే అవకాశం లేదని ప్రజలు ఇప్పటికే నిర్ణయించారు అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# మంత్రి కొండపల్లిని కలిసిన సీఐఐ





**అమరావతి,కలంకౌంటర్ :** సీఐఐ ఏపీ ఛాప్టర్ సభ్యులు గురువారం రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఏపీ సీఐఐ ఛైర్మన్, అపెక్స్ సొల్యూషన్ ఐటీ కంపెనీ అధినేత సరణం నరేంద్రకుమార్, సీఐఐ వైస్ ఛైర్మన్ డాక్టర్ జి. సాంబశివరావుతో పాటు సీఐఐ ఏపీ ఛాప్టర్ హెడ్ రాజేష్ మంత్రిని కలిసి పలు విషయాలు చర్చించారు. ఎంఎస్ఎంఈ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో మూడేళ్ల కాలంలో10 వేల మంది ఎస్‌హెచ్‌జీలకు శిక్షణ ఇచ్చేందుకు ఎంవోయూ కుదుర్చుకున్నట్టు సీఐఐ సభ్యులు తెలిపారు. అలాగే పారిశ్రామిక ఉద్యోగాల కల్పనకు కూడా సీఐఐ ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకున్నట్టు కూడా వారు మంత్రికి తెలిపారు. ఇప్పటికే నాలుగు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ( స్కిల్లింగ్ సెంటర్స్) ద్వారా మూడు వేలమందికి శిక్షణ ఇస్తుండగా.. మరో నాలుగు కేంద్రాల ఏర్పాటు కోసం ప్రతిపాదించినట్టు సీఐఐ సభ్యులు తెలిపారు.

# నవ్యాంధ్రా సాధన కోసం ఏపీ సీఎం చంద్రబాబు తీసుకొచ్చిన సంస్కరణలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి

● ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింప చేస్తాయి ● ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడతాయి ● చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ఉద్ఘాటన ● చిత్తూరు పార్లమెంటు ప్రగతి పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయన్న ప్రసాదరావు



**చిత్తూరు,కలంకౌంటర్ :** నవ్యాంధ్రప్రదేశ్ సాధన కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన సంస్కరణలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింప జేస్తాయన్నారు. ప్రతిపక్షాల విమ-ర్శలను తిప్పికొడతాయని ఉద్ఘాటించిన ఆయన..., చిత్తూరు పార్లమెంటు ప్రగతి పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయని తెలియజేశారు. వైకాపా అధినేత జగన్ మోహన్ రెడ్డి మావిగన్ అనే అంశాన్ని తెరపైకి తెచ్చిన నేపథ్యంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు స్పందించారు. ఎన్డీఏ సర్కార్ సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రాజధానిని నిర్మించి, తెలుగు జాతి ఔన్నత్యాన్ని చాటిచెప్పాలనే ధృడ సంకల్పంతో ముందుకు సాగుతుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు ఈ రకమైన విమర్శలు చేయడం తగదన్నారు. అమరావతి రాజధాని కావాలని, దీనికి సంబంధించి వేల ఎకరాలు అవసరమని చెప్పిన వారు ఇప్పుడు ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను మభ్యపెట్టడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. 2014లో జరిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన, తీవ్ర ప్రతికూలతలకు దారితీసిన నేపథ్యంలో.,2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను, ఎన్డీఏ సర్కార్ సహకారంతో సాధిస్తోందని ఆయన చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబు.... ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని రెండు కళ్ళుగా భావించి, సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరువ చేస్తూ..,ఓ ప్రణాళిక బద్ధంగా ప్రజలకు సుపరిపాలన అందించడం తమ అందరికీ గర్వకారణంగా ఉందన్నారు. ఇకనైనా ప్రతిపక్షాలు తమ వైఖరిని మార్చుకోవాలని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు హితవు పలికారు.

# 8 వ పోషణ పక్వాడ 2026 ప్రారంభం

● మహిళా శిశు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది ● పోషకాహారంతోనే చిన్నారుల ఉజ్వల భవిష్యత్ ●అంగన్‌వాడీల రూపురేఖలు సమూల మార్పు ● 55,766 కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన ● గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి ●185 కోట్లతో 130 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు ● ఆటపాటల ద్వారా విద్యాబోధన.. అంగన్‌వాడీల్లో ఐక్యూ (IQ) పెంపునకు ప్రాధాన్యత ● మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ మరియు గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి









**విజయవాడ,కలంకౌంటర్ :** 9 ఏప్రిల్ నుండి 23వ తేదీ వరకు నిర్వహించే పోషణ పక్వాడ 2026 కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్థానిక ఫార్మర్స్ ట్రైనింగ్ సెంటర్ లో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ.. గర్భిణీ స్త్రీల నుండి రెండు సంవత్సరాల లోపు చిన్నారులకు సరైన పోషకాహారం, ఆరోగ్యం, విద్యా విషయాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే పౌష్టికాహారం పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరమైన పెరుగుదలకు ఎంతగానో దోహదపడుతుందని, ఈ విషయంపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పిల్లలతో నేరుగా సంభాషించడం ద్వారా వారి తెలివితేటలను పెంపొందించడంపై తల్లిదండ్రులకు మార్గదర్శనం అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆధునీకరణ, ఆటపాటల ద్వారా పిల్లల్లో నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఆటవస్తువులతో పాఠాలు బోధించడం, వారి ఐక్యూ స్థాయిని పర్యవేక్షించడం జరుగుతోందని తెలిపారు. రాష్ట్రంలో మహిళలు మరియు చిన్నారుల ఆరోగ్యానికి పోషకాహారం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి గర్భిణీ, బాలింత, చిన్నారి వరకు సరైన పోషణ అందేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. పోషణ పక్వాడ ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యమని, ముఖ్యంగా గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల్లో పోషకాహారం పై చైతన్యం కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను మరింత బలోపేతం చేస్తున్నాం. అంతేకాకుండా, మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, అందుకే మహిళల ఆరోగ్యం, శిశు సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 55,766 అంగన్‌వాడి కేంద్రాలలో టీవీలు,ఆటవస్తువులు, మరుగుదొడ్లు, తాగునీటి వంటి మౌలిక సదుపాయాలను ప్రభుత్వం ఇప్పటికే కల్పించిందని వెల్లడించారు. గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెడుతూ పీఎం జనమన్ పథకం కింద ?185 కోట్ల వ్యయంతో గిరిజన గ్రామాల్లో 130 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. పిల్లలకు ఆకర్షణీయంగా కనిపించే జంక్ ఫుడ్స్‌కు బదులుగా ఇంట్లో తయారు చేసిన పోషకాహారం, పండ్లు, పాలు, కూరగాయలు ఇవ్వాలని సూచించారు. పిల్లలు ఏడవగానే ఫోన్లు లేదా టీవీలు అలవాటు చేయకుండా, కుటుంబ సభ్యులు వారితో సమయం గడుపుతూ మంచి సంస్కారాలు నేర్పించాలని పిలుపునిచ్చారు. నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు.. పిల్లల ఎత్తు, బరువులను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ, పోషకాహార లోపం ఉన్న వారికి అవసరమైన విటమిన్ టాబ్లెట్లు, నాణ్యమైన ఆహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఏ. సూర్య కుమారి మాట్లాడుతూ... పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదల కోసం సరైన పోషకాహారం మరియు తల్లిదండ్రుల శ్రద్ధ అత్యంత అవసరమన్నారు. ప్రస్తుత జీవన శైలిలో మార్పులు పిల్లల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని అన్నారు. గతంలో ఇంటి ఆహారం ఆరోగ్యానికి మేలు చేసేదని, ప్రస్తుతం జంక్ ఫుడ్ అలవాట్లు పెరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. చిన్న వయసులోనే సరైన పోషకాహారం అందించడం, ముఖ్యంగా మొదటి రెండు సంవత్సరాల్లో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం ఎంతో అవసరమని సూచించారు. పోషణ పక్వాడ కు సంబంధించి అవగాహన కల్పించే ప్రచార పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రతినిధి నరసింహ మూర్తి, జాయింట్ డైరెక్టర్ ఏ. ప్రవీణ, జేపీసీ పోషణ అభియాన్ సునంద, ఆర్డీవో టీవీ సతీష్, ఐసీడీఎస్ పీడీ రుక్సానా, టాటా ట్రస్టు జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ డి. శ్రీనివాస్, జిల్లాల సీడీపీవోలు, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.

# కోటారెడ్డి నర్సింగ్ హోమ్ లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలను ప్రారంభించిన ఎమ్మెల్యే ఇంటూరి

● కందుకూరు ప్రాంత ప్రజలకు మూడు తరాలుగా స్వర్గీయ డాక్టర్ కోటారెడ్డి కుటుంబం సేవలు -- ఎమ్మెల్యే ● ఎన్టీఆర్ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోండి -- డాక్టర్ సాకేత్ ● ఎమ్మెల్యేకు ఆత్మీయ స్వాగతం పలికిన డాక్టర్ శివకుమార్ రెడ్డి, మృదుల దంపతులు, డాక్టర్ సాకేత్ రెడ్డి, మౌనిక దంపతులు.





**కందుకూరు,కలంకౌంటర్ :** పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. గురువారం కందుకూరు పట్టణంలోని కోటారెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నందు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవను శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ వివై కోటారెడ్డి దగ్గర నుంచి డాక్టర్ శివ కుమార్ రెడ్డి, డాక్టర్ సాకేత్ ఇలా మూడు తరాల జనరేషన్ కందుకూరు ప్రాంత ప్రజలకు సేవలు అందించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో కూడా ఈ ప్రాంత ప్రజలకు అధునాతన వైద్యాన్ని అందిస్తారని భావిస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా తమ కుమారులు ఇద్దరు ఇదే వైద్యశాలలో జన్మించారని ఎమ్మెల్యే గుర్తుచేసుకున్నారు. పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా కందుకూరి నియోజకవర్గంలో ఇప్పటివరకు 1200 మందికి సహాయం అందించాము. దాదాపు 10 కోట్ల రూపాయలు మంజూరు చేసి ముఖ్యమంత్రి పెద్ద మనసు చాటుకున్నారు. త్వరలో ప్రతి ఒక్కరికి ఆరోగ్య భద్రత కల్పించేందుకు ఇన్సూరెన్స్ పాలసీలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురాబోతోందని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలియజేశారు. ఈ సందర్భంగా... కొత్తగా ఏర్పాటు చేసిన అత్యాధునిక కార్పొరేట్ స్థాయి ల్యాబరేటరీని ఎమ్మెల్యే ప్రారంభించారు. డాక్టర్ సాకేత్ మాట్లాడుతూ... తమ హాస్పిటల్ లో ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎప్పటికప్పుడు ఆధునిక టెక్నాలజీతో వైద్యసేవలు అందిస్తామని చెప్పారు. ఎన్టీఆర్ వైద్య సేవ కార్డు లేకపోయినప్పటికీ తమకున్న రేషన్ కార్డు ద్వారా ఎన్టీఆర్ వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నేతలు ఉన్నం వీరాస్వామి, అల్లం వెంకటేశ్వర్లు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, కంద్రా మాల్యాద్రి, కొచ్చెర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి కేసుల్లో పట్టుబడితే జీవితాలు అస్తవ్యస్తమే - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్




**విజయనగరం,కలంకౌంటర్ :** ఎవరైనా గంజాయితో పట్టుబడితే ప్రస్తుతం అమలులో ఉన్న కఠిన చట్టాలతో జీవితాలు నాశనమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కావున, గంజాయి రవాణ, విక్రయాలు, వినియోగం వంటి వాటికి యువత దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఒక ప్రకటనలో - ప్రస్తుతం గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు కఠిన చర్యలు చేపడుతూ, చట్టాలను కూడా కఠినతరం చేసారన్న విషయాన్ని యువత గుర్తించాలన్నారు. చట్టాలు ఎంత కఠినంగా మారాయంటే, హత్య చేసిన వ్యక్తికి న్యాయస్థానాలు 12సం.లు వరకు శిక్ష విధిస్తే, అదే విధంగా ఒక వ్యక్తి గంజాయి అక్రమ రవాణాకు పాల్పడి, పోలీసులకు పట్టుబడితే సదరు వ్యక్తికి మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టం ప్రకారం 20సం.లు వరకు శిక్ష విధించబడుతుందన్నారు. అంటే గంజాయి అక్రమ రవాణాకు పాల్పడడం అన్నది ఎంత తీవ్రతరమైన నేరమన్న విషయాన్ని యువత గుర్తించాలన్నారు. గంజాయి కేసుల్లో ఎక్కువగా యువతే పట్టుబడుతూ, జైళ్ళలో మగ్గుతున్నారన్నారు. గంజాయి కేసుల్లో న్యాయస్థానాలు కూడా వెంటనే బెయిలు మంజూరు చేసే పరిస్థితులు లేవన్నారు. యువత చెడు వ్యసనాలకు, చెడు స్నేహాలకు అలవాటుపడి, తాత్కాలిక ఆనందం కోసం గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటుపడి, వారి అవసరాలను తీర్చుకొనేందుకు అక్రమదారుల్లో ప్రయాణిస్తూ, జైలుపాలవుతున్నారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. ప్రజలు గంజాయి గురించి ఏదైనా సమాచారం తెలిస్తే 1972కు గాని, డయిల్ 100/112కు గాని లేదా స్థానిక పోలీసులకు గాని సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. గడిచిన ఆరు నెలలలో 20 గంజాయి కేసులు నమోదుచేసామని, 85 మందిని అరెస్ట్ చేసి జైలుకు తరలించామని, రూ.12,50,000/- విలువగల సుమారు 300 కిలోల గంజాయిని సీజ్ చేసామన్నారు. ఇటీవల గంజాయితో పట్టుబడిన 85మందిలో సుమారు 35మంది యువత ఉండడం బాధాకరమని జిల్లా ఎస్పీ తెలిపారు. కావున, యువత తమ చెడు అలవాట్లుకు స్వస్తి పలికి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. గంజాయి వ్యాపారుల ప్రలోభాలకు లొంగొద్దని, గంజాయి అక్రమ రవాణ, విక్రయాలు, వినియోగాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కోరారు.

# చిన్న పాండ్రాక పీహెచ్సీలో ఎనిమిదవ పోషణ పట్వాడా ప్రారంభం



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని చిన్న పాండ్రాక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్య ఆరోగ్యశాఖ మరియు ఐసిడిఎస్ వారి సమీక్ష ఆధ్వర్యంలో ఎనిమిదవ పోషణ పక్వాడా మరియు మాతృత్వ సంరక్షణ కార్యక్రమం ప్రారంభమయ్యింది. ఏప్రిల్ 9 నుండి 23 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ పోషణ కార్యక్రమం లో భాగంగా చిన్న పాండ్రాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రారంభమైంది. కార్యక్రమంలో సిడిపిఓ సముద్రవేణి మాట్లాడుతూ జీవిత తొలి దశలో మొదటి ఆరు సంవత్సరాలు వయసులో మెదడు పెరుగుదల బాగా ఉంటుందని జింక్ ఫుడ్స్ మాని పండ్లు కూరగాయలు పిల్లలకు పెట్టాలని సూచించారు పిల్లలను ఫోన్లకు టీవీలకు దూరంగా ఉంచుతూ శరీర వ్యాయామం ఆటలు క్రీడల వైపు మళ్ళించాలని సిడిపిఓ సముద్రవేణి సూచించారు. డాక్టర్ సోనియా నారాయన్ మాట్లాడుతూ గర్భవతి అని నిర్ధారణమైన వెంటనే నమోదు చేయించుకుని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సకాలంలో వ్యాక్సిన్లు వేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం అంతా డాక్టర్ సూర్యతేజ్ సారథ్యంలో జరిగింది. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు హెల్త్ సూపర్వైజర్లు ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు అంగన్వాడీ వర్కర్లు గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి నేతన్నకూ 'ఉచిత విద్యుత్' అందాల్సిందే...

● రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత




**విజయవాడ,కలంకౌంటర్ :** అర్హులైన ప్రతి నేతన్నకూ ఉచిత విద్యుత్ ఫలాలు అందించాల్సిందేనని, ఇందుకు విద్యుత్, చేనేత, జౌళి శాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ .సవిత స్పష్టం చేశారు. చేనేతల్లో ఉచిత విద్యుత్ పథకంపై అవగాహన కల్పించడానికి గ్రామ స్థాయిల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు గడువుగా పేర్కొన్నారు. విజయవాడలోని ఓ హోటల్ లో విద్యుత్, చేనేత, జౌళి శాఖాధికారుల సమన్వయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ఎన్నికల ముందు నిర్వహించిన యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ చేనేతల కష్టాలను స్వయంగా చూశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడికి సైతం చేనేత కష్టాలపై స్పష్టమైన అవగాహన ఉందన్నారు. అందుకే, అధికారంలోకి కూటమి వస్తే ఉచిత విద్యుత్ ఇస్తామని ఆనాడు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ఎన్నికల హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకాన్ని రూ.150 కోట్ల వ్యయంతో ఈ నెల ఒకటో తేదీ నుంచి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారన్నారు. మగ్గంపై నేసే నేతన్నలకు 200 యూనిట్లు, మర మగ్గంపై నేతన్నలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. మగ్గం నేతన్నలకు నెలకు రూ.720లు, మ-రమగ్గం నేతన్నలకు రూ.1,860లు ఆదా అవుతుందన్నారు.

**ఈ నెల 15లోగా దరఖాస్తులకు గడువు..** విద్యుత్, చేనేత, జౌళి శాఖాధికారులు సమన్వయంతో ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని మంత్రి సవిత సూచించారు. గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహించి, లబ్ధిదారులను గుర్తించి, వారితో దరఖాస్తు చేయించాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తులకు ఆఖరు గడువు అని స్పష్టంచేశారు. లబ్ధిదారుల ఎంపిక నిర్లక్ష్యం చూపొద్దని, పొరపాట్లు జరిగితే ఆయా జిల్లాల డీవోలే బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి సవిత స్పష్టం చేశారు. ప్రభుత్వానికి, లబ్ధిదారులకు చేనేత, జౌళి శాఖాధికారులు వారధిగా ఉండాలన్నారు. చేనేతలకు మేలు చేయాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఇప్పటికే చేనేతలకు లబ్ధి కలిగించేలా వ్యక్తిగత పథకాలు ప్రారంభించామన్నారు. 50 ఏళ్లు నిండిన చేనేతలకు రూ.4 వేల పెన్షన్ అందజేస్తున్నామన్నారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మాట్లాడుతూ, చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. విద్యుత్, చేనేత, జౌళి శాఖాధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, విద్యుత్ శాఖాధికారులు, వివిధ జిల్లాలకు చెందిన చేనేత, జౌళి శాఖకు చెందని ఏడీలు, డీవోలు పాల్గొన్నారు.

**సినిమా చూపేంత సీన్ జగన్ కు లేదు...** విలేకరుల అడిగిన ప్రశ్నకు మంత్రి సవిత స్పందిస్తూ, సీఎం చంద్రబాబుకు సినిమా చూపేంత సీన్ లేదని మంత్రి సవిత స్పష్టంచేశారు. పాదయాత్ర కాకపోతే జగన్ పొర్లు దండాలు చేసుకోవాలని సూచించారు. ఆయన్ను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రతిపక్షంలో అమరావతికి అంగీకరించారని, తరవాత మూడు ముక్కలాట ఆడారని, ఇప్పుడు మావిగన్ అంటూ మరో డ్రామాకు తెరతీశారని మండిపడ్డారు. అమరావతి ప్రాంత రైతులను, మహిళలను జగన్ తీవ్ర ఇబ్బందుల పాల్జేశారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా జగన్, ఆయన బ్యాచ్ ఎన్నో కుట్రలు పన్నారని మంత్రి సవిత మండిపడ్డారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com